# నేనెరిగున్న మనిషి

[యూనివర్సిటీ యూనియన్ ఎలక్షన్లంటే అర్థం ఎనిమిది వందల నవ్వుతూన్న ముఖాలు. ఎన్నాళ్లనుంచో వికలమైపోయిన మనస్సును మళ్లీ ఒక్కసారి ఆనందంతో నింపాయి.

ఎప్పుడైనా విశాఖసముద్రంలో వెన్నెల నీడలు చూచారా? దూరాన్నుంచి చూస్తుంటే తాటి చెట్ల చాటుల్లోంచి అందాన్నంతా పిండి ఆరబోస్తుంది సముద్రం.

అందమైన ఆడపిల్ల ముఖం మీద కుంకుమరేఖలా కాచింది చంద్రబింబం - కష్టాలన్నింటినీ మరిపించి చిరునవ్వులా.

దూరాన క్లాక్ టవర్ ఎనిమిది చూపుతోంది. మొగలి పొదల్లోంచి వాసన దూరదూరంగా వ్యాపిస్తోంది, హుమాయూన్ పంచిన కస్తూరిలాగ.

చేతులు విసురుతూ జోరుగా నడుస్తున్నాను. అంతనూ మరచిమరిచిపోని గమత్తు మనస్థితిలో.

ఎవరు నేను? ఏం కావాలి? ఈ ప్రశ్నలన్నీ అణిగిపోయాయి. దూరంగా ఆలోచిస్తే నన్ను నేను మోసం చేసుకుంటున్నానా అనిపించింది. ఇసకలో అడుగు కష్టంగా పడుతోంది. ఎదురుగుండా సముద్రం. ముందుకు పోవడం సాగదు. ఆలోచనలూ ఆగిపోయాయి]

సుబ్రమణ్యం నిజంగా తన్ను తాను మోసగించుకుంటున్నాడు. తన మాటల్తో ప్రపంచాన్నంతా మోసగిస్తున్నానని అతని ఆనందం. అసలు మోసపు కబుర్లు చెప్పి

## "మూన్స్"

ముందు తనని తాను మోసగించుకుంటే తప్ప ప్రపంచాన్ని మోసగించటం సాధ్యం కాదని చెప్పినా, ఈ వాదనలో పస అతనికి కనిపించదు.

అతన్ని ఏదేనా ఓ ప్రశ్న అడగండి - వెంటనే ఎంత సమాధానం వస్తుందో, ఉదాహరణకి - ఫలానా సినిమా చూశావా అని అడగండి.

"ఇదివరకే చూశాను. ఆరు నెల్లయింది! మధుబాల! ఫర్వాలేదు. నర్గీస్ కన్న నయం. ఎందుకు బ్రదర్. మొన్న మనం బొంబాయి వెళ్లినపుడు అలా నిలబడి గంటన్నరసేపు చూశాను. చాలా అందంగా వుంటుంది. చాలామంది నేను చూసిన సినిమా తారలు తెరమీద కనిపించేటంత అందంగా వుండరు మామూలుగా చూస్తే. అలా కాదే మధుబాల. చాలా బాగుంటుంది లే. ఆవేళ స్టూడియోకి వెళ్లాను. ఇంగ్లీషు చక్కగా మాట్లాడుతుంది. ఆంధ్రులంటే ఎంత అభిమాన మనుకున్నావ్... ఒక చిన్న రహస్యం చెప్పనా...ఆమె మొదుగున్నాడే పట్టి దద్దమ్మట. 'మధు' ముందు మన తెలుగుతార లెంత వర్థిచేత్త... అంతెందుకు - మొన్న మద్రాస్ వెళ్లినపుడు..."

సుబ్రమణ్యాన్ని ఎప్పుడెళ్లావ్ మద్రాసు...ఎందుకెళ్లావ్ అని అడక్కూడదు. అవి చాలా చికాకు పరిచే ప్రశ్నలు.

సుబ్రమణ్యం ఆలోచనలు చాలా ఎత్తుని మేఘాల్లో ఎగురుతూ వుంటాయి అస్తమానం. అమెరికా వెళ్లడంగురించి అమలాపురం వెళ్లడం అంత తేలిగ్గా మాట్లాడుతాడు.

"...ఎందుకు బ్రదర్" బెర్త్ రిజర్వ్ చెయ్యమని ఈ వేళ వ్రాస్తే ఎల్లుండి సాయంకాలానికి ఉత్తరం వస్తుంది. ఓడ ఏజంట్లు నిన్ను ఈగలు ముసిరినట్లు ముసురుతారు. ఇంక ఓడ ఎక్కాక అసలు ఈ ప్రపంచమే నీది కాదనుకో. అక్కడనుంచి ఇంక భోజనం...స్నానం అంత గొడవా వాళ్లదే...టెన్నిస్ ఆడేవాళ్లకి టెన్నీసు... సినిమా చూసే వాళ్లకి సినిమా...డాన్సు చేసేవాళ్లకు అదీ ఇంక అక్కడి క్లాక చగువంటావా? మన దేశంలో వుత్తి వెధవలముందు వాళ్ల ప్రొఫెసర్లు ఎందుకూ పనికి రారనుకో...మన రామం వున్నాడు చూశావా...వాడూ..."

ఇంతకూ అమెరికా వెళ్లడానికి డబ్బెక్కడిది? ఈ ప్రశ్న సుబ్రమణ్యం ఎప్పుడూ ఆలోచించినట్లు కనిపించదు. ఇలాంటి అల్పవిషయాలు అతను ఆలోచించడానికి టైమ్ చాలదు.

చెప్పొచ్చేదేమిటంటే సుబ్రమణ్యంతో మాట్లాడటమనేది నిజంగా ఒక అనుభవం. అందరికీ లభించే సదవకాశం.

అతనితో ఒకసారి ఈ వాగుడు కొంచెం కట్టిపెట్టమన్నాను. ఇలా పేలుతూవుంటే వచ్చే లాభమేమిటి అనిఅడిగాను. అందరూ తన్ని గురించి ఏమనుకుంటున్నారో కొంచెం ఆలోచించమన్నాను. నిర్ఘాంతపోయాడు. కొంచెం చిన్నబుచ్చుకున్నాడు కూడ. "నువ్వనేదేమిటో నాకు బోధపడటంలేదు. నాకు వాక్స్వాతంత్ర్యం లేదా? అయినా నేనేమీ ఎవరికీ హాని చెయ్యటంలేదే." ఈ ధోరణిలో ఇంకా సాగింది. చివరికి అతను తేల్చింది నాకు అసూయ మహోజాస్తిగా వుందని.

నాకు వొళ్లు మండింది. "ఎందుకు - నువ్వు అమెరికా వెళ్తున్నందుకా?"

"వెళ్లిననాడు అందువు గానిలే" అన్నాడు.



ఇంతే జరిగిన దెబ్బలాట. సుబ్రమణ్యం నాతో సరిగా మాట్లాడటం లేదు. ఒక విధంగా నేను విచారించాను. అతని వుద్రేకాన్నీ వుత్సాహాన్నీ అణిచేశానేమోనని. ఇలా ఆలోచించినప్పుడల్లా చాలా కష్టంగా వుండేది.

ఒకనాడు హాస్టల్ అరుగుమీద కూర్చున్నాను. వెనకాలే వచ్చాడు. చల్లగా చెయ్యివేసి పక్కన కూర్చున్నాడు. ఆశ్చర్యపడి చూశాను... "...మా చెల్లెలు పోయింది. నిన్ననే వుత్తరం వొచ్చింది... పదమూడేళ్లు..." అగాడు... "నేను ఎన్నో కలలు కన్నాను. ఒక్కటొక్కటే కూలిపోతున్నాయి..."

కష్టాల్లో కాని మానవుని నిజరూపం బయటపడదు. తనెవరో, తనకి అన్యాయం చేస్తున్న దెవరో, తన పరిస్థితి ఎందుకు ఇలా తయారయిందో వెనక్కి తిరిగి చూసుకుంటున్నాడు సుబ్రమణ్యం ఏదో ఆలోచనల్లో మునిగిపోయి బడిటైమ్ అయిందని లేచిన విద్యార్థిలా...

మనిషి తన్ను ఎక్స్-రే చేసుకుంటున్నప్పుడు మనిషి ముఖం పసిపాపల ముఖంలా వుంటుంది. దూరపు తన నిజజీవితాన్ని పొరలు పొరలుగా కప్పిన మోసపు తెరలనన్నింటినీ, చీల్చుకు చూడగలుగుతాడు జీవితాన్ని.

"అదే. అంతే జరిగింది. అంతా తగలేశాడు నాన్న. అమ్మ ఏదిచేద్దామనుకుంటే సాగుతుంది? తన శాయశక్తులా ప్రయత్నించింది. ప్రతిఫలం? తిట్లూ దెబ్బలూ... ఇప్పుడేమంటాడో తెలుసా నాన్న... అంతా అమ్మేచేసిందంటాడు. దెబ్బలాడని క్షణం లేదింట్లో... చెల్లికి జబ్బుచేస్తే డబ్బులే దింట్లో....నిజంగా లేదు. నువ్వు నమ్మకపోవచ్చు...అమ్మని కొడుతూంటే నన్ను కౌగలించుకు కూర్చొనేది..."కళ్లమ్మట నీళ్లు గిర్రున తిరిగాయి..."యిదంతా సముద్రం...ఇక ముందుకు సాగలేను..." గొంతు పూడుకుపోయింది...కన్నీళ్లలోంచి ప్రపంచాన్ని చూస్తుంటే అంతా అలుక్కుపోయి ఏమీ లేనట్లు కనిపించిందేమో... మాట్లాడలేదు.

విచారపు మనస్సులకి చిరునవ్వుముఖాలు తగిలించి నడిచే మానవు లెంతమంది? ఒక్కొక్కర్ని నిజం మాట్లాడిస్తే ఎన్నెన్ని గాథలు పైకొస్తాయి...అసలు నా చుట్టూ వున్న ఈ వందల నవ్వుముఖాల్లో, నాది కూడా కలుపుకొని, మొత్తం సుబ్రమణ్యాలెంతమంది?

మన స్తత్వం తెలుసుకోవటం చాలా సులభం. సినిమాలంటే జనానికి ఎందుకింత మోజు? ఆ రెండుగంటలసేపూ హీరో పడే బాధలన్నీ తనవి....హీరోయిన్ పడే కష్టాలకీ, శ్రీ 'మెహాబత్' పాటలకీ అన్నింటికీ తమ హృదయమూ కంపిస్తుంది. విలన్ పెట్టే కష్టాన్ని కేవలం తన్ని పెడుతూన్నట్లే వుంటుంది. ఈ అనుభూతుల్లో తన చెల్లెలు జబ్బునీ, బట్టలు కనుక్కో లేక పోయిన దారిద్ర్యాన్నీ అంతనీ అలా మరచిపోవడంకోసం.

అదే సుబ్రమణ్యం చరిత్ర-అతని అమెరికా యాత్ర...మధుబాలా దివ్యదర్శనం మొదలైనవన్నీ అతని మనస్సులో సుడిగుండాలను దాచిపెట్టే మహా ప్రయత్నం.

మళ్లీ సుబ్రమణ్యం ముఖంమీద చిరునవ్వు కనిపించలేదు. కొన్నాళ్లకి అతను కనిపించడమే మానేశాడు.

మా స్నేహితుడు సూర్నారాయణను అడిగాను. "సుబ్రమణ్యం కనిపించటం లేదేం" అని.

"ఎవరతను?" అన్నాడు...

ఎవరని చెప్పను? సుబ్రమణ్యం...అంతే.

"ఇంతమందిలో ఎవరో అతను-వంద సుబ్రమణ్యాలున్నారీ హాస్టల్లో-నోరు మూసుకు పడు...అన్ని గొడవలూ నీకే కావాలి..."

కథ అర్థమవుతూనే వుంది - చెల్లెలు ఎందుకు చనిపోయిందో, అందుకే సుబ్రమణ్యం కాలేజీ మానేశాడు...

[గాలి రివ్వున విసిరింది. సముద్ర కెరటాలు వొచ్చే యుద్ధాన్ని గురించి వార్నింగిస్తున్నట్లు ఏడుస్తూ మొరలెడుతున్నాయి. తాటిచెట్టు మీద పక్షి రెక్కలు టపటపలాడించింది. ఎన్నో వందలమంది నవ్వుతూన్న పళ్లవరసలా సముద్రంమీద కెరటాలు బొమ్మలురాస్తూ చెరిగిపోతున్నాయి. జీవితంమీద పుట్టిన ఆశ్చర్యంతో దూరంగా చూస్తే డాల్ఫిన్స్‌నోస్ కదలకుండా చెదరకుండా అలానే నిలబడివుంది...... జీవితంలా...ప్రపంచంనుంచి ఎప్పటికీ... అంతరించని చిరునవ్వులా...] ★




